# కంటి ముందు అభివృద్ధి.. మీ ముందు గాంధీ

*ఐటీ అడ్డాలో ఎగిరేది మళ్లీ గులాబీ జెండానే.. :విప్ గాంధీ*



కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో ఇంటింటి ప్రచారంలో విప్ గాంధీ, కార్పొరేటర్ జూపల్లి, పార్టీ శ్రేణులు

మియాపూర్, అక్టోబర్ 31 : పెద్దఎత్తున ఐటీ పరిశ్రమలకు నెలవై ప్రపంచ పటంలో చోటు దక్కించుకున్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముచ్చటగా మూడోసారి గులాబీ పార్టీ ఘన విజయం తథ్యమని విప్ అరెకపూడి గాంధీ అన్నారు. కండ్ల ముందు వేల కోట్ల అభివృద్ధి.. ప్రజల ముందు గాంధీ ఉన్నాడని, వారి సంపూర్ణ ఆశీర్వాదం తనకు మెండుగా ఉందన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, పార్టీ శ్రేణులతో కలిసి విప్ గాంధీ మంగళవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, మహిళలు గాంధీకి ఘనస్వాగతం పలికి ఆయన వెంట ప్రచారానికి కదిలారు. అనంతరం విప్ గాంధీ మాట్లాడుతూ.. పూర్వపు పాలనలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న నామమాత్రపు అభివృద్ధి కేవలం పదేండ్ల వ్యవధిలో ఊహించని స్థాయికి చేరిందన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో తనకు సంపూర్ణ తోడ్పాటునందించాలని కోరారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

– పార్టీకి కార్యకర్తలే బలమని, వారి కృషితోనే రెండుసార్లు బీఆర్‌ఎస్ విజయఢంకా మోగించిందని విప్ అరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి అఖండ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి డివిజన్ శేషాద్రి కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు సహా పార్టీ నేతలతో కలిసి గాంధీ పాల్గొన్నారు. ప్రజా మద్దతుతో హ్యాట్రిక్ సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ప్రభాకర్ రెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గమైన చర్య

**ముషీరాబాద్ బీఆర్‌స్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్**



చిక్కడపల్లి, అక్టోబర్ 31: సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రక్త చరిత్రను సృష్టించాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తుందని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం హేయమైన చర్య అని, దానిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. అభ్యర్థి ప్రభాకర్ రెడ్డి గన్‌మన్ కాపాడటంతోపాటు సకాలంలో వైద్య సదుపాయం అందడంతో ఆయనకు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని వివరించారు. ఇలాంటి ఘటనలు ఇప్పటి వరకు తెలంగాణలో జరగలేదన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఇలాంటి దుర్మార్గమైన చర్యకు పాల్పడుతుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

## హత్యా రాజకీయాలకు కాంగ్రెస్ యత్నం

- **జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్**



బంజారాహిల్స్, అక్టోబర్ 31 : రానున్న ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిపోవడంతో కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాల ద్వారా భయాందోళనలు సృష్టించాలని చూస్తుందని, ఇలాంటి పిచ్చి ప్రయత్నాలు మానుకోకపోతే ఆ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో తిరగలేరని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే మాగంటి పేర్కొన్నారు. వివాదరహితుడిగా పేరున్న కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి ఘటనలో కుట్రదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలిచే అవకాశం లేని కాంగ్రెస్ పార్టీ దాడులు చేయడం ద్వారా బీఆర్‌ఎస్ కార్యకర్తలను భయాందోళనకు గురిచేయాలని చూస్తున్నారని, తాము తలుచుకుంటే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కనీసం ఎన్నికల ప్రచారానికి కూడా రాలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్స్ కేటాయింపు తర్వాత ఓటమి ఖాయం చేసుకుంటే బీజేపీ ఇంకా టికెట్లు ఇవ్వడానికే అష్టకష్టాలు పడుతుందని ఎద్దేవా చేశారు.

# సీట్లు అమ్ముకునే కాంగ్రెస్.. ప్రజా సేవ చేస్తదా?

- ప్రతి పక్షాలకు.. ఏం చేయాలో తోస్తలేదు
- ప్రజాక్షేత్రంలో గెలువలేకే కాంగ్రెస్ దాడులు
- పేదలు నివసించే జవహర్‌నగర్‌ను.. జూబ్లీహిల్స్ తరహాలో తీర్చిదిద్దా
- కార్మిక శాఖ మంత్రి, మేడ్చల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు కొండల్

జవహర్‌నగర్, అక్టోబర్ 31: బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలకు ఏం చేయాలో తోస్తలేదని, సీట్లు అమ్ముకునే పార్టీల నాయకులు ప్రజలకు ఎలా సేవ చేస్తారా అని, సీఎం కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ సుభిక్షంగా మారిందని కార్మిక శాఖ మంత్రి, మేడ్చల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదని, కాంగ్రెస్, బీజేపీలు కొట్లాటలకే సరిపోతారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాక్షేత్రంలో గెలువలేక దాడులకు దిగుతుందని, ఎంపీ కొత్త ప్రభాకర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. జవహర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ బలంగా ఉందని, అత్యధిక మెజార్టీ జవహర్‌నగర్ నుంచే వస్తుందని ఆశాభావం వ్యక్త చేశారు. పేదలు నివసించే జవహర్‌నగర్‌ను జూబ్లీహిల్స్ తరహాలో తీర్చిదిద్దామని, రూ. 200కోట్లతో కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసి తెలంగాణలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి చేశామన్నారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా నాయకులు మేకల అయ్యప్ప, రాజశేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు భార్గవ్‌రామ్, ఉద్యమకారులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌చారి, సింగన్న బాల్‌రాజ్, మహేశ్, నవీన్, సిద్ధులు యాదవ్, సోమయ్య, మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- అమీర్‌పేట్‌లో బీఆర్‌ఎస్‌లో 150 మంది చేరిక



మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

మహేశ్వరం, అక్టోబర్ 31 : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికే పట్టం కట్టాలని, మహేశ్వరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం అమీర్‌పేట్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి 150 మంది మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మహేశ్వరం పోతర్ల బాబయ్య ఫంక్షన్‌హాల్‌లో జరిగిన గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన గిరిజన మోర్చా మహిళా నాయకురాలు బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో వందలాది మందితో మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో చేరారు.

# మర్చిపోతామా సాయన్న సాయం..

- కంటోన్మెంట్ అభివృద్ధిపై వినూత్న వీడియో
- డైలాగులు చెప్పిన కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.లాస్యనందిత
- సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు



మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్, చీపురు బస్తీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.లాస్యనందిత, పార్టీ నాయకులు

మారేడ్‌పల్లి, అక్టోబర్ 31: మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.లాస్యనందిత ఓటర్లను ఆకట్టుకునేలా వినూత్న ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జీహెచ్‌ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సీఎన్.నర్సింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ పరిధిలో రెజిమెంటల్ బజార్, చీపురు బస్తీల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు నళిని కిరణ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.లాస్యనందిత, సోదరి నివేదితలు ప్రజలను ఆకట్టుకునేలా.. వినూత్న వీడియోను తీశారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది.

'మర్చిపోతమా సాయన్న చేసిన సాయం.. మర్చిపోతామా సాయన్న చేసిన సాయం.. కంటోన్మెంట్‌లో లాస్యనందిత గెలుపు ఖాయం' అంటూ బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్ చెప్పగా, 'అప్పుడెట్లుంది తెలంగాణ.. అప్పుడెట్లుంది తెలంగాణ... ఇప్పుడు ఎట్లుంది తెలంగాణ' అని అభ్యర్థి జి.లాస్యనందిత అనగా, 'తెలంగాణలో నవంబర్ 30న అందరి వేళ్లకు ఉండాలి ఇంకు.. ఇంకు దెబ్బకు రాష్ట్రమంతా పింకు పింకు' అంటూ అభ్యర్థి సోదరి నివేదిత బీఆర్‌ఎస్ మహిళా నాయకులతో కలిసి నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

### ఆశీర్వదించండి..అభివృద్ధి చేస్తా.

తనను ఆశీర్వదించండి..కంటోన్మెంట్‌ను మరింత అభివృద్ధి చేస్తా అంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.లాస్యనందిత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్, చీపురుబస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అశోక్ ముదిరాజ్, సురేశ్, సందీప్, అనిల్, బాబా, మురళీయాదవ్, రాము, వెంకట్, కృష్ణఫర్, కుమారి తదితరులు పాల్గొన్నారు.